# ప్రయాణం

-డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

నాలుగోసారి కాబోలు కిటికీ పక్కన కూర్చున్న ఆమెవైపు అసూయగా చూసాను. నాకు ప్రయాణాల్లో కిటికీ ప్రక్కన సీటు దొరక్కపోతే మహా చిరాగ్గా వుంటుంది. అసలే పగటి ప్రయాణం. ప్రొద్దు గడవడమే కష్టం.

కిటికీ పక్క సీటైతే బయటకు చూస్తూ మనుష్యులను గమనిస్తూనో, మబ్బుల్లో ఆకారాలు వెతుక్కుంటూనో, సన్నగా పాడుకుంటూనో గడిపేయవచ్చు. నేనలా అన్నిసార్లు ఆవిడవైపుపరీక్షగా చూస్తున్నా ఆమెమాత్రం నావైపు తల తిప్పి చూడనేలేదు. అహం దెబ్బతిన్న ఫీలింగ్...కాస్త ముందుగా రిజర్వు చేయించుకుందని గర్వం కాబోలు. లేక నావైపు చూస్తే ఆ సీటు నాకిమ్మని ప్రాధేయపడతాననుకుందా?

మరోసారి ఆమెవైపు చూసాను. దగ్గర దగ్గర నలభై ఏళ్ళ వయసుండవచ్చుననిపిస్తోంది. చామనఛాయ రంగే అయినా పెద్ద పెద్ద కళ్ళు...కళగా ఉంది. పొందికగా కాటన్ శారీ కట్టింది.

ఎండలో ప్రయాణమైనా జారిపోయే పాలియెస్టరు చీర కట్టక ప్రయాణానికి సుఖంగా ఉండే నూలు చీర కట్టిన ఆవిడపట్ల కాస్త గౌరవంలాంటిది కలిగింది. జలుబు చేసిందేమో...కర్చీఫు అడ్డం పెట్టుకుని మాటిమాటికీ ముక్కు ఎగబీలుస్తోంది.

ఇహ ఆవిడవైపు చూడడం విసుగేసింది. బ్యాగ్‌లో నుండి సినిమా పత్రిక తీసి తిరగేస్తూ కూర్చున్నాను. జడ్చర్ల చేరేసరికి నాలుగు కావొచ్చింది. దాహంగా ఉంది. నిమ్మసోడా తాగాలనిపించింది. మేగజైను సీట్లో పడేసి బస్ దిగాను.

సోడా త్రాగి కాసేపు అటూ ఇటూ చూస్తూ ప్లాట్‌ఫారం మీద నిలబడ్డాను. అటు చూడవద్దని అనుకున్నా నా దృష్టి అప్పుడప్పుడు ఆవిడవైపు మళ్లుతూనే ఉంది. తమాషా ఏమిటంటే బస్ కదులుతున్నంతసేపూ బయటకు చూస్తూ కూర్చున్నదల్లా బస్‌స్టేషన్‌లో ఆగగానే ముఖం అటు తిప్పుకుని బస్ లోపల పరీక్షిస్తోంది. నాకు కుతూహలం పెరిగింది. అంతసేపు పక్కవాళ్లతో ఒక్క మాటేనా పలకకుండా ఉండేవాళ్లు ఆడవాళ్లల్లో అరుదు. తక్కువ మాట్లాడేవాళ్లు ఆలోచనాపరులై ఉంటారని అంటారు. ఆవిడ ఏం చదువుకుందో? మనిషిని చూస్తేసంస్కారవంతురాలిగా వుంది.

డ్రైవరు ఎప్పుడు వచ్చి సీట్లో కూర్చున్నాడో నేను గమనించనేలేదు. హారన్ మోగడంతో ఉలిక్కిపడి బస్ ఎక్కాను. మాగజైను నేను పెట్టిన చోట్లో అలాగే ఉంది. నిరాద్‌చౌదరి 'పాసేజ్ టు ఇంగ్లాండ్'లో ఇండియన్ పబ్లిక్ బిహేవియర్ గురించి రాసినది గుర్తొచ్చి నవ్వొచ్చింది.

నిజమే చదువుతుంటే మధ్య పేజీలు పొలైట్‌గానే లాక్కుని పంచుకునే అలవాటు మనది.

తెలుగు సినిమా పత్రిక పక్కనపెట్టి వెళ్లినా ఆవిడ ముట్టుకోకపోవడం ఆశ్చర్యమే.

కొంపదీసి తెలుగు రాదేమో అన్న అనుమానంతో మళ్లీ పరీక్షగా చూసాను ఆమెవైపు.

ఇప్పుడు తల అటు తిప్పి బయటకు చూస్తోంది. ఆ ముక్కుపుడకా, నల్లపూసలూ, మట్టెలు చూస్తుంటే తెలుగింటి పడుచల్లే ఉంది. కట్టుకున్నదేమో వెంకటగిరి జరీ చీర.

నా అంతట నేను పలకరించడం అలవాటు లేకపోయినా "ఏ ఊరు వెళ్తున్నారు?" అని అడిగాను.

"కర్నూలు" తల తిప్పకుండానే ముక్తసరిగా జవాబిచ్చింది.

"పుట్టింటికా?"నన్ను చూస్తే నాకే ఆశ్చర్యంగా ఉంది. ఎవరైనా అనవసర ప్రశ్నలు అడిగితే విసుక్కునేదాన్ని.

"కాదు. అత్తవారిల్లు" ఈసారీ పొడిగానే వుంది జవాబు. ఇక లాభం లేదనుకుని సినిమా పత్రిక బ్యాగ్‌లో పెట్టేసి మెడికల్ జర్నల్ బయటకు తీసాను. చదువుతుంటే చీకటి పడిన సంగతి తెలియలేదు. కదిలే బస్‌లో చదవకూడదుగానీ కాలక్షేపం అయ్యేదెలా? నంద్యాలలో బస్ ఆగింది. పుస్తకం సీటుమీద పెట్టి కనకాంబరాలు కొందామని దిగాను. అలాగే కాఫీ కూడా త్రాగి బస్ ఎక్కేసరికి నా సీట్లో పెట్టిన మెడికల్ జర్నల్ ఆవిడ చేతిలో కనబడింది. 'కొంపదీసి డాక్టరా ఏమిటి?' అనిపించి కాస్త మర్యాదగా ఒదిగి కూర్చున్నాను.

బ్యాగ్‌లో నుండి కొత్త రుమాలు తీసుకుని ముక్కు, ముఖం తుడుచుకుని నావైపు చూసి నవ్వింది. నేనూ నవ్వాను.

"నేనేం మాట్లాడకుండా కూర్చున్నానని గర్విష్ఠి అనుకున్నారా?"

ఆవిడ గొంతు తియ్యగా ఉంది. మాటల్లో సంస్కారం ఉంది.

"అదేంలేదు. ఏదో ఆలోచనలో ఉన్నారనుకున్నా" అన్నాను.

"ఆ...మా స్నేహితురాలి గురించి..." అని నిట్టూర్చింది.

"ఏమయ్యింది?"

"కాన్సర్ అంటూ వస్తే బ్రతకడం జరగదు కదూ?" అడిగిందావిడ.

"అదేంలేదు. ఎర్లీ స్టేజెస్‌లో కనుక్కుంటే సరైన ట్రీట్‌మెంట్ ఇస్తే భయంలేదు" అన్నాను.

"సెకండరీ స్టేజ్‌లో కనుక్కుంటే?" అంది నా కళ్లల్లోకి చూస్తూ.

"అయినా ఫర్వాలేదు. చిన్న వయస్సులో వాళ్లకైతే కీమోథెరపీతోపాటు ఆపరేషన్ కూడా చేస్తారు. భయంలేదు" చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పాను.

"కానీ భయంకరమైన వ్యాధి కదూ? భరించడం ఎంత బాధ? మా నాన్నగారిని చూసాను. ఆయనకు యూసోఫేగస్ (గొంతు) కాన్సర్. కానీ మా ఫ్రెండ్‌కు బ్రెస్ట్ కాన్సర్" అంటూనే గబుక్కున ముఖానికి రుమాలు అడ్డం పెట్టుకుంది.

ఎంత నొక్కిపెట్టినా గొంతులో నుండి వెక్కిళ్లు వినబడుతూనే ఉన్నాయి. రెండు నిముషాల తరువాత కంట్రోల్ చేసుకుంది. కళ్లూ, ముఖము తుడుచుకుని నావైపు చూసి "సారీ" అంటూ నవ్వింది.

అప్పుడు గమనించాను. ఆవిడ నవ్వులో నిండుతనంలేదు. అతికించుకున్నట్లు ఉంది.

"మీకెంతమంది పిల్లలు?" టాపిక్ మార్చాను.

"ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి. పెద్ద కొడుకు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. రెండోవాడు ఇంటర్. అబ్బాయిల గురించి బాధలేదు. అమ్మాయి గురించే దిగులంతా. ఎనిమిదో క్లాసులో వుంది. చిన్నది" ఆవిడ గొంతు బొంగురుగా ఉంది.

"ఆ బాధ భరిస్తూ బ్రతకడంకన్నా ఎలుకల మందు త్రాగి చావడం మేలుకదూ?" హఠాత్తుగా అందావిడ.

"ఎవరన్నారు? మీ ఫ్రెండా?" అడిగాను.

"ఆ...అదే అలా ఫీలవుతోంది'' తడబడింది ఆమె.

"ఎలుకల మందు త్రాగి చావడం అంటే అంత సులభమేంకాదు. బాధ భరించలేక కేకలు పెట్టడం చూసాను. ఆ మాటకొస్తే ఏ రకమైన ఆత్మహత్యా ప్రయత్నమైనా బాధాకరమే. కానీ ఆ బాధకన్నా కాన్సర్ బాధకన్నా కూడా ఆడ పిల్లకు చిన్న వయసులో తల్లిపోతే కలిగే బాధ మరీ భయంకరమైనది కాదంటారా?ఐమీన్...మీ ఫ్రెండ్‌కి కూడా పిల్లలుండి ఉంటారుకదా. వాళ్లకోసమైనా అందులోనూ ఆడపిల్ల వుంటే ఆ పిల్లకోసం బ్రతకాలి'' అన్నాను.

"కానీ ఈ వ్యాధి చాలా బాధపెడుతుందని...'' అంటూ ఆగిపోయింది.

"మీరు ఎప్పటి మాటో చెబుతున్నారు. ఇప్పుడు కొత్త మందులూ, కొత్త



చికిత్సా విధానాలూ వచ్చాయి. ఇప్పుడు కాన్సరంటే భయపడి పోనక్కర్లేదు'' ఎంతో ధీమాగా విశ్వాసం కలిగేట్టు అన్నాను.

"ఇదిగో ఇందులో ఒక ఆర్టికల్. దీనిమీదే ఉంది. అదే చదువుతున్నా'' పుస్తకం చూపిస్తూ మళ్లీ అన్నాను.

"అది చూసే అనుకున్నా మీరు డాక్టరై ఉంటారని'' అందావిడ.

ఇప్పుడావిడ గొంతులో ఇందాకటి బరువులేదు.

"ఒక నిజం చెప్పనా?'' కుతూహలంగా చూసింది.

"మీరు ఎంతో ఆత్మీయురాలిలా కనబడుతున్నారు. నాకు బ్రెస్ట్ కాన్సర్. చిన్న వయసని ఆశ్చర్యపోకండి. నాకు ఇద్దరు పిల్లలు. బాబుకు నాలుగేళ్లు, పాపకు రెండేళ్లు. ఈ వ్యాధి గురించి తెల్సినప్పుడు నేనూ మీ స్నేహితురాలి లాగే చచ్చిపోవాలనుకున్నా. ఆపరేషన్ చేసి బ్రెస్ట్ తీసేసారు. ఇంకో పదేళ్ల ఫర్వాలేదు. ఈలోపుగా పాప కాస్త పెద్దదవుతుంది. తల్లిలేని లోటును తట్టుకో గలుగుతుంది. అందుకే పాప కోసం బ్రతకాలని నిశ్చయించుకున్నా'' నా గొంతు ఉద్వేగంతో, దుఃఖంతో వణికింది. కళ్లు తడిసాయి.

"బాధపడకండి'' నా చేతిమీద చేయి వేసి నొక్కిందామె.

ఆమె ముఖంలో ఇదివరకు కనిపించిన నిరాశలేదు. ముఖం కాస్త తేటపడింది. కర్నూలు వచ్చింది. ఆవిడ బస్ దిగింది నాతోపాటే.

"మిమ్మల్ని కలుసుకోడం నాకెంత మేలు చేసిందో మీకు అర్థంకాదు మెనీ మెనీ థాంక్స్'' రిక్షా ఎక్కుతూ అంది.

"మీ స్నేహితురాలి తరపున కూడా చెప్తున్నారా?'' నవ్వి ఆవిడ చేయి నొక్కి వదిలి పెట్టి అందించాను. రిక్షా కదిలింది.

"హాయ్ వసూ!'' అంటూ వచ్చి వాటేసుకుంది సునీత.

"ఏమిటి దేశ సేవ?'' వెళ్తున్న రిక్షావైపు చూస్తూ అడిగింది.

"నేను సైతం ప్రపంచాగ్నికి సమిదనొక్కటి ఆహుతిచ్చాను'' అంటూ నవ్వాను.

"నీ తెలుగు ఎమ్ఏ ప్రావీణ్యమంతా రాబోయే పెళ్లికొడుకు మీద చూపు తల్లీ. పద పద మీ వదిన ఎదురుచూస్తోంది పెళ్లికూతురు రాకుండా పెళ్లి చూపులు ఎలాగా అని'' అంటూ చేతిలోని జర్నల్ తీసుకుని చూసి "ఇంకా ఈ పిచ్చి వదల్లేదా? ఈ డాక్టర్ సంబంధం కుదిరితే నీ ఇంటరెస్టుకు, టేస్టుకు సరిపోతుంది'' అంటూ నవ్వింది. నేనూ నవ్వి ముందుకు నడిచాను.

★